రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# మట్టి పూడ్చేసి.. ప్లాట్లు కొట్టేసి!

## నీళ్ల చెరువులో క్రికెట్ గ్రౌండ్
## కీసలో కళ్ల ముందే కబ్జా



అక్రమ వెంచర్‌లో నిర్మాణాల చిత్రాన్ని, అధికారులకు ఫిర్యాదు చేసిన నకళ్లను చూపిస్తున్న బాధిత భూయజమానులు

**లేఅవుట్ల పేరిట అమాయకులను ముంచేందుకు ప్లాన్**

**రోడ్డు కోసం పొరుగు పట్టా భూమిపై రియల్ రాబందులు**

**కలెక్టర్ నుండి తహసీల్దార్ దాకా ఫిర్యాదులు**

**తక్షణం కూల్చేయాలని హైడ్రాకు బాధితుల మొర**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం గోధుమకుంట గ్రామంలో రియల్ ఎస్టేట్ మాఫియా అక్రమాలు శృతిమించాయి. స్థానిక గోకరకుంట చెరువును అక్రమంగా మట్టితో పూడ్చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఓపెన్ ప్లాట్ల వెంచర్లు వేస్తూ, ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాధిత భూ యజమానులు సామల దయానంద్ రెడ్డి, వెంకట్ రెడ్డిలు ఈ వివరాలు వెల్లడించారు. గోధుమకుంట సర్వే నంబర్ 2లో తమకు చెందిన పట్టా భూమిలోకి చొరబడి కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**అడ్డుకుంటే బెదిరిస్తున్నారు**

ఈ అక్రమ వెంచర్‌కు రోడ్డు ఏర్పాటు చేసే నెపంతో తమ భూమిని లాక్కునేందుకు చూస్తున్నారని, దీనిని నిలదీస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. చెరువు నిబంధనలకు సంబంధించిన సర్వే నంబర్లు 3, 4 రికార్డులను పక్కనబెట్టి, సర్వే నంబర్లు 5, 6 లలో ఎలాంటి హెచ్‌ఎమ్‌డీఏ అనుమతులు లేకుండానే అక్రమంగా ఓపెన్ ప్లాట్లుగా లేఅవుట్లు మలిచారని బాధితులు ఆరోపించారు. అంతేకాకుండా, సర్వే నంబర్ 4 లో ఉన్న గోకర కుంట చెరువులో మట్టి నింపి దాన్ని క్రికెట్ గ్రౌండ్‌గా మార్చి, అక్రమ నిర్మాణాలు చేపడుతూ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారని మండిపడ్డారు.

**ఫిర్యాదు చేసినా పట్టించుకోరేం?**

ఈ భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి పట్టించుకోకపోవడం శోచనీయమని బాధితులు విమర్శించారు. ఈ వ్యవహారంపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, కీసర ఆర్‌డీవో, తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌తో పాటు హెచ్‌ఎమ్‌డీఏ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

**ప్లాట్లు కొని మోసపోవద్దు**

వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సర్వే నంబర్లు 2, 3, 4, 5, 6 లలో సమగ్ర భూ సర్వే నిర్వహించి, భౌతిక హద్దులను గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేని ఈ అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి సామాన్య ప్రజలు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

**ఆశలన్నీ హైడ్రా పైనే..**

ఇక తమ ఆశలన్నీ హైడ్రా అధికారుల పైనే ఉన్నాయని.. చెరువు ఆక్రమణలను తక్షణమే అడ్డుకుని, అక్రమార్కులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.

## జోరుగా..

**39 ఊళ్లకు.. 300 బెల్టు షాపులు**

# లూజ్ సేల్స్!



**యాలాల, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** బెల్టు షాపులను అరి కట్టాల్సిన ఆబ్కారీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పచ్చని పల్లెల్లో చిచ్చుకు కారణమవుతున్నారు. మద్యం విక్రయాలపై ప్రభుత్వం విధించిన టార్గెట్‌లను పూర్తి చేయడం కోసం తాగుబోతులకు అడ్డాగా మారుతున్నాయి. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యాలల మండలంలో ఉన్న 39 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం కేవలం రెండే వైన్ షాపులకు అనుమతులు ఇచ్చింది. కానీ, క్షేత్రస్థాయిలో దాదాపు 300కి పైగా బెల్టు షాపులు నడుస్తున్నాయి. ప్రతి గ్రామంలోనూ దాదాపు 10 నుండి 13 వరకు అక్రమ దుకాణాలు వెలిసాయి. టీ కొట్లు, చిల్లర కిరాణా షాపుల్లో సైతం మద్యం గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నారు. అర్ధరాత్రి వేళల్లో కూడా మద్యం సులభంగా దొరుకుతుండటంతో పల్లెల్లో ప్రశాంతత కొరవడింది.

ఈ బెల్టు షాపుల ప్రభావం ముఖ్యంగా యువతపై తీవ్రంగా పడుతోంది. చదువు, ఉద్యోగాలు వదిలేసి వ్యసనాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. నివాస గృహాల మధ్యనే మద్యం దుకాణాలు ఉండటంతో తాగుబోతుల వేధింపులు ఎక్కువై, మహిళలు బయటకు రావడానికే భయపడుతున్నారు. రోజూ ఇంట్లో గొడవలు జరగడం, దానికి తోడు ఆరోగ్యం క్షీణించి కొంతమంది ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం ప్రియుల బలహీనతను ఆసరాగా చేసుకుని బెల్టు షాపుల నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. ఎమ్మార్పీ ధరల కంటే క్వార్టర్

>>2

**◆ఊరికి 10 నుండి 13పైనే దుకాణాలు ◆24 గంటలూ బిజినెస్ ◆ఎమ్మార్పీ కంటే రూ.50 అదనం ◆ఒక వంతు మద్యం..మూడొంతులు కల్తీ! ◆మందు ప్రియుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ◆సర్కారు టార్గెట్ పూర్తి చేయడమే లక్ష్యంగా ఆబ్కారీ టీం ◆మామూళ్ల మత్తులో పచ్చని పల్లెల్లో చిచ్చు..**

దొడ్డిదారిన అక్రమ మద్యం వ్యాపారానికి పచ్చజెండా ఊపుతున్నారు. ఎక్సైజ్‌శాఖ ఉన్నత స్థాయి అధికార యంత్రాంగం ప్రభుత్వ ఖజానా నింపుకోవడంపైనే దృష్టి పెడుతూ ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాలాల మండలంలో అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గల్లీ గల్లీకీ మద్యం దుకాణాలు వెలిసి, 24 గంటలూ అందుబాటులో ఉండటంతో

# మైనారిటీలకు కొండంత అండగా ఉంటున్నాం

**కాంగ్రెస్ పాలనలోనే నిజమైన న్యాయం**

**ఇందిరమ్మ యోజనతో మహిళలకు రూ.50 వేల సాయం**

**ఉపాధి రంగానికి సరికొత్త ఊపిరిలూదుతున్నాం**

**నూరు శాతం సబ్సిడీతో జెనరేటర్లు, టూల్ కిట్లు, మోపెడ్ల పంపిణీ**

**ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లతో విదేశీ విద్యకు ప్రాధాన్యం**

**మేడ్చల్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**కలెక్టరేట్‌లో భారీగా చెక్కుల పంపిణీ**




మైనార్టీ మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** గత ప్రభుత్వాల హయాంలో మైనారిటీల సంక్షేమాన్ని తీవ్రంగా నిరక్ష్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వేయి రోజుల్లోనే అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజాపాలన సాగిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. స్థానిక మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయన వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు, ఉపాధి యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజనను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం కింద మేడ్చల్ జిల్లాలోని 225 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా తురకకాశ ముస్లిం వర్గానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీతో రూ. 60 వేల విలువైన జెనరేటర్లు, టూల్ కిట్లను అందజేసినట్లు వివరించారు. రేవంత్ అన్నా సహాయ మిషన్ కింద మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు, స్వయం ఉపాధి కోసం రూ. లక్ష విలువ చేసే మోపెడ్ వాహనాలను అందించామని మంత్రి తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిం చాలనుకునే మైనారిటీ విద్యార్థుల కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా నిధు లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధితో పాటు నగర శివారు ప్రాం తాలను జీహెచ్‌ఎంసీ తరహాలోనే కార్పొరేషన్లుగా తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ పి. మహేందర్ రెడ్డి, ఎమ్మె ల్యేలు సీహెచ్. మల్లా రెడ్డి, అరికెపూడి గాంధీ, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్తవాల్, హజ్ కమిటీ సభ్యులు ఎండి ముజీబుద్దీన్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫయాజ్ అహ్మద్, మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్మయి

## చదువులో వెనకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు, ప్రీప్రైమరీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కే.కిరణ్మయి సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చౌదరి గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రీప్రైమరీ కేంద్రాలను ఆమె సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి అవసరమైన అదనపు బోధన అందించాలని ఆదేశించారు. ప్రీప్రైమరీ కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్ చిన్నారులకు అందిస్తున్న బోధన, ఆటలు, అభ్యసన కార్యక లాపాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. న

**గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం**

అనంతరం ఇంద్రానగర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో అదనపు కలెక్టర్ పాల్గొని గ్రామ సభలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను సమీక్షి ంచారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదిత రులు పాల్గొన్నారు.

# చేతకాకపోతే చేతులెత్తేయ్

**సిఎంకు చెప్పి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిస్తా**

**ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం**

**ప్లాన్ రాలేదనే సాకుతో పనుల్లో జాప్యం చేస్తున్నారని ఆసహనం**

**యాలాల సెప్టెంబరు 1,ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరగడంపై ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి అధికారుల, కాంట్రాక్టర్‌లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే యాలాల మండ లంలోని తిమ్మాయిపల్లి గ్రామ శివారులో నిర్మాణం చేపట్టే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. గత ఏడాది జులై మాసంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పాఠశాల నిర్మాణ స్థలంలో కేవలం మట్టిని మాత్రమే తరలించారు. కనీసం పాఠశాల నిర్మా ణ పనులు బేస్‌మెంట్ కూడా కాకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

కేవలం మట్టిని మాత్రమే తరలించిన కాంట్రాక్టర్ భవన నిర్మాణ (మ్యాప్) ప్లాన్ రాలేదనే సాకుతో పనుల్లో తీవ్ర జాప్యం చేయడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. పనులు చేయడం చేతకాకపోతే వదిలేయ్యాలని సదరు కాంట్రాక్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు. పనితీరులో మార్పు రాకుంటే సిఎం దృష్టకి తీసుకెళ్లి కాంట్రాక్టర్ లైసెన్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం జరుగుతోందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపిపి కరణం పురుషోత్తంరావు, పిఎసిఎస్ చైర్మన్ సురేం దర్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ యాలాల మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే తిమ్మాయిపల్లి గ్రామ శివా రులో ఏర్పాటు చేసిన శుభ సాయి కన్స్‌ట్రక్షన్స్ (హాట్ మిక్స్ ప్లాంటును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు.



ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించటానికి వచ్చి..ఫోన్‌లో కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి



ధర్నా చేస్తున్న కందనెల్లితాండా గ్రామస్తులు

## 10 రోజులుగా నీళ్లు లేవ్

**ఖాళీ బిందెలతో కందనెల్లితాండా వాసుల రాస్తారోకో**

**పెద్దేముల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం కందనెల్లి తాండా వాసులు తాగునీరు సరఫరాలో అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా రోడ్డెక్కారు. గ్రామ సర్పంచ్‌కు, సంబందిత అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడంతో సహనం కోల్పోయిన తాండావాసులు మంగళ వారం తాండూరు- సంగారెడ్డి ప్రధానరహదారిపై రాస్తారోకో నిర్వహించి ధర్నా చేపట్టారు. ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేస్తు రొడ్డుపై బైఠా యించారు. తాగునీరు లేక అల్లాడుతున్న అధికార యంత్రాంగం స్పందిం చడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత పది రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తుండగా, ఐదు రోజులకోసారి మాత్రమే మిషన్ భగిరథ నీరు సరఫరా అవుతోందని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు తమ పోరాటం సాగిస్తామని స్పష్టంచేశారు. తాండూరు రూరల్ సిఐ ప్రవీన్‌కుమార్‌రెడ్డి, టౌన్ సిఐ పరమేశ్వర్‌గౌడ్, యంపిడిఓ తిరుమల స్వామి సంఘటన స్థలానికి చేరుకొని తాండావాసులను సముదా యించారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషిచే స్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందే

## ఉద్యోగుల జెఏసి నేతల డిమాండ్

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయా లని తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి రంగారెడ్డి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యా చరణ సమితి రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యా హ్న భోజన విరామ సమయంలో కొంగరకలాన్‌లోని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యా చరణ సమితి రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ కాంట్రి బ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**10న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి**

రాష్ట్ర ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి కార్యాచరణలో భాగంగా ఈ నెల 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ కాంట్రి బ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగులకు ఎంతో ప్రమాదకరమైనదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఈ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రస్తుతం ఆ అంశాన్ని దాటవేసే ధోరణి సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగో తరగతి ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగుల భవిష్యత్తు భద్రత కోసం తమ గొంతును మరింత బలంగా వినిపిస్తూ ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ కన్వీనర్ శ్రీనేష్ కుమార్ నోరి, సహ చైర్మన్లు గోపాల్, ప్రవీణ్, శాంతిశ్రీ, సుధాకర్, రాజేష్, బల్వంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు నూతనకంటి వెంకట్,సైదమ్మ, రాకేష్, కార్యదర్శులు మాధవ్, ఆనంద్, మహేష్, ప్రమీల, వెంకటప్ప, పాండు రంగారెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ, అరుణ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న జెఏసి నాయకులు



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీధర్

## 4,5న కొడంగల్‌కు సిఎం టూర్

**కొడంగల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** కొడంగల్‌లో ఈనెల 4,5 తేదీల్లో రెండు రోజుల పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ ఐఏఎస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళవారం ఆయన కొడంగల్‌కు చేరుకొని కొడంగలన నియోజకవర్గం మున్సిపల్ పరిధిలో పూరైయిన భవనాలను సిఎం ప్రారంభించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పరిశీలిం చారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలో పూర్తి అయిన భవనాలను ప్రారంబిస్తారని, పనులకు సంభందించిన ఏర్పాట్లను కలెక్టర్ దీపక్ తివారీ, అడిషనల్ ఎస్పీ, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిలతో కలిసి అభివృద్ధి పనులు, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్,కమ్యూనిటీ హెల్త్ సెంటర్,ప్రాధమిక పాఠ శాల(బాలికల)ను పరిశీలించి పూర్తి స్దాయిలో ఏర్పాట్ల చేయాలని అధికారులకు ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఇండస్ట్రియల్ పార్క్, రేడియల్ రింగ్ రోడ్లకు సంభందించిన భూ సేకరణ పనులను ఆక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ(కడా) కార్యాలయంలో వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల కలెక్టర్‌లు దీపక్ తివారి, సిహెచ్ ప్రియాంక, రెవెన్యూ అధికారులు డిఆర్‌ఓ తదితరులతో కలిసి 3 ప్రాజెక్టు భూ సేకరణ,పనుల పురోగతిపై సమీక్షించారు.

## మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరా

**జవహర్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** మైనారిటీల మహిళలకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఐటీ శాఖ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇందిరమ్మ మైనరిటీ మహిళ యెజన చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఆయాన ముఖ్య అతిధిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేశారు. కార్యక్రమంలో చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టి అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేష్‌గౌడ్, చంద్రపురి డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, బల్లి శ్రీనివాస్, నంగునూరి అశోక్, గజ్వేల్ శంకర్, బిబ్బిలి మంజుల, విజయ్‌రాజు, మైనారిటీ అధ్యక్షుడు రఫీక్, ఎర్రగుండ్ల వెంకటేష్, అనంతలక్ష్మి, గండిసునిత, పరుశురాం, రాజుయాదవ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

## 102 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**కందుకూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలో 102 అంబులెన్స్ సేవలపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాల్సి న అవసరం వైద్య సిబ్బందిపై ఉంటుందని 102 అంబులెన్స్ పైలట్ దార అశోక్ పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హుమేర మేడం సమక్షంలో పీహెచ్ సి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతొ నిర్వహించిన ఆశా డే సమావేశంలో 102 అంబులెన్స్ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, హైరిస్కు గర్భిణీలు ప్రసవ సమయంలో అత్యవసర పరిస్థితులు ఎదుర్కోవడం నవజాత శిశువులు మరియు చిన్నారులకు అవసరమైన వైద్య సేవలను ఈ 102 అంబులెన్స్‌లో అందించడం వలన ప్రజలకు విస్తృత ప్రయోజనాలు ఉపయోగించితిని అవకాశం ఉంటుందన్నారు.

## ఓటరు జాబితాలో సవరణలకు విశేష స్పందన

**షాద్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఓటర్ల రద్దీ నెలకొంది. ఓటు నమోదు, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర అంశాలకు సంబంధించి తలెత్తిన సమస్యలపై అధికారులు జారీ చేసిన నోటీసులను తీసుకొని పలువురు ఓటర్లు విచారణకు హాజరయ్యారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఉదయం నుంచే మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవడంతో కార్యాలయం కిటకిటలాడింది. తమ వద్ద ఉన్న ఆధారాలు, అవసరమైన పత్రాలను అధికారులకు సమర్పిస్తూ ఓటర్లు తమ సమస్యలను వివరించారు. ఓటు నమోదుకు సంబంధించిన ప్రక్రియలో అధికారులు పూర్తిస్థాయిలో సహకరిస్తుండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో విచారణకు తరలివచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కమిషనర్ సునీతారెడ్డి కార్యాలయంలో జరుగుతున్న ప్రక్రియను స్వయంగా పర్యవేక్షి ంచారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు, నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## డ్రగ్స్‌కు నో చెప్పడం ప్రతి విద్యార్థి నేర్చుకోవాలి

**షాద్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు ఎవరైనా డ్రగ్స్ తీసుకోమని ఒత్తిడి చేసినప్పుడు మొహమాటానికి పోకుండా ధైర్యంగా నో చెప్పడం ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి సూచించారు. షాద్‌నగర్ పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో పాలమూరు విశ్వవిద్యాలయ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భవాని శంకర్, అధ్యాపకులు కరుణాకర్‌తో పాటు ఇతర అధ్యాపకులు, సుమారు 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## శిరీష హత్య కేసులో నిందితులకు శిక్షించాలని ధర్నా

**షాద్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 21 ఏళ్ల ఆదివాసీ యువతి వి.కె. శిరీష దారుణ అత్యాచారం, హత్యకు గురైన ఘటనపై ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉన్నత చదువులు చదువుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలవాలనే ఆశయంతో నగరానికి వచ్చిన గిరిజన యువతికి ఇలాంటి దారుణం జరగడం అత్యంత బాధాకరమని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వద్ల శ్రీకాంత్ అన్నారు. ఈ కేసులో పోలీసులు ఒకరిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించినప్పటికీ, దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంపై కూడా సమగ్ర విచారణ జరపాలని, ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో అన్ని అంశాలను పరిశీలించాలని కోరారు.



శిరీష హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా తక్షణమే విచారించి నిందితులకు కఠిన శిక్ష విధించాలని, ఉద్యోగినికి రక్షణ కల్పించడంలో విఫలమైన ఆసుపత్రి యాజ మాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. అలాగే నగరాలకు ఉపాధి, విద్య కోసం వచ్చే శ్రామిక మహిళలు, నర్సులు, విద్యార్థినుల భద్రతకు కార్యాలయాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లలో ప్రత్యేక రక్షణ చర్యలు, సమర్థ వంతమైన భద్రతా వ్యవస్థలు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, వంశీ, రామ్‌చరణ్, విష్ణువర్ధన్, నబీతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ఘనంగా సీరత్ ఉన్ నబీ జల్సా

**షాద్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలో సయ్యద్ సుల్తాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సీరత్ ఉన్ నబీ జల్సా ఘనంగా నిర్వహించారు. సొసైటీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సభ్యులు, ఫోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆలియా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన జామియతుల్ మోమినాత్ డాక్టర్ రిజ్వానా జరీన్ పీహెచ్‌డీ, ప్రిన్సిపాల్ శకుని హదీస్ జామియతుల్ మోమినాత్ ముఖ్య అతిథిగా హాజరై దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిజ్వానా జరీన్ మాట్లాడుతూ.. అల్లాహ్ మనిషికి మానవ రూపాన్ని ప్రసాదించిన ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని, సోదరభావంతో సమాజానికి ఉపయోగపడే విధంగా తమ జీవితాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు వెయ్యి మందిని ఒకే వేదికపై సమీకరించి, అందరి ఆశీస్సులు పొందేలా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన సొసైటీ సభ్యులు, నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ దాడులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటాన్ని బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జ్ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీ దాడులు, విధ్వంసాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడటం అత్యంత హేయమైన, పిరికిపందల చర్య అని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. రాజకీయ ప్రత్యర్థుల ఇళ్లపై దాడులు చేయడం ద్వారా కాంగ్రెస్ నాయకులు ఏం సాధించాలనుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## బిజెపి కార్యాలయంపై దాడి చేసిన దోషులను శిక్షించాలి

**కుల్కచర్ల, సెప్టంబరు1 ప్రభాతవార్త:** బీజేపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ కుల్కచర్ల మండల కేంద్రంలోని బీజేపి పార్టీ కార్యాలయంలో బీజేపి నాయకులు మిడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు మాట్లాడుతూ..ప్రజాస్వామంలో రాజకీయ పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం సరికాదని అన్నారు. రాజియంగా విభేదాలు ఉన్నప్పటికి వాటిని ప్రజాస్వామ్య పద్దతిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. దాడులకు పాల్పడటం ద్వారా ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేయడంపై జరిగిన ఘటనపై ప్రభుత్వం, పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వార్యల ఆంజిలయ్య టెలికాం అడ్వైజర్ కమిటి మెంబర్ వెంకటయ్య గౌడ్, దిశా కమిటి మెంబర్ జానకిరామ్ చౌహన్, మాజీ సర్పంచ్ సౌమ్యరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్, అసెంబ్లీ కన్వీనర్ గాడుసు మహిపాల్, సినియర్ నాయకులు రాంచంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 3న ఎన్ఆర్ఐ కోటాలో యూజీ సీట్లకి కౌన్సిలింగ్

### అగ్రి వర్సిటీ ఉప కులపతి అల్దాస్ జాన్య

**అత్తాపూర్ సెప్టెంబరు 1,ప్రభాతవార్త :** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో గల కళాశాలలలో వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ఎన్ఆర్ఐ / ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటాలో మిగిలిన సీట్లలో ప్రవేశాలకి 3వ తేదీ( గురువారం)న వాక్ ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పిజెటిఎయు ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రకటించారు. రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్స్ సెంటర్‌లో ఉదయం10 గంటలకు ధృవ పత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ జరగనుందని అల్దాస్ జానయ్య వివరించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు అనివార్య కారణాల వల్ల దరఖాస్తు చేసుకొని వారు సైతం కౌన్సిలింగ్ కి హాజరు కొవ్చని ఆయన స్పష్టం చేసారు. అభ్యర్థులు వారి తల్లి తండ్రులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌ని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకొని అర్హత కల అభ్యర్థులు అవసరం అయిన పత్రాలు, ఫీజులతో కౌన్సిలింగ్‌కి హాజరు కావాల్సిందిగా అల్దాస్ జానయ్య సూచించారు.

# సిసిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సెప్టెంబరు 1ని పెన్షన్ విద్రోహదినంగా పాటించి నల్లబ్యార్జీలతో నిరసనలు తెలియజేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద తెలంగాణ ఉద్యోగుల జెఏసి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా చైర్మన్ బి.రవిప్రకాశ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యార్జీలు ధరించి నిరసనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయాలని ఓపిఎస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎఎసి చైర్మన్ బి.రవిప్రకాశ్ మాట్లాడుతూ ఉద్యోగుల పదవీ విరమణ తరువాత ఆర్థిక, సామాజిక భద్రతకు పటిష్టమైన హామీ కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని వెళ్తున్న సమయంలో తెలంగాణ ఉద్యోగ జెఏసి నాయకులు, ఉద్యోగులు నల్ల బ్యార్జీలు ధరించి సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ నిరసనలు తెలుపటంతో రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు వారి వద్దకు వెళ్లగా సిపిఎస్ సమస్యను మంత్రికి వారు వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లాలని జెఏసి నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో జిల్లా టిజిఈజెఏసి కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు వెంకటేశ్వర్లు, విఠల్, మదన్‌రెడ్డి, జైయసింహరెడ్డి, డాక్టర్ కురుమూర్తి, భరత్‌కుమార్, శేషసాయి గిరికాంత్, కార్తీక్, అశ్విని, అక్షయ్, వెంకట్‌రెడ్డి, ఉమ, కిషోర్, ప్రియాంక, సుదర్శన్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న జెఏసి నాయకులు, ఉద్యోగులు

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రీ సర్వే

**యాలాల, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** గ్రామాల్లో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్ గ్రామంలో భూ భారతి-భూ రీ సర్వే కార్యక్రమంపై అవగహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు రీ సర్వేతో దూరం అవుతాయని తెలిపారు. చాలా మంది రైతులు భూములు ఒకచోట ఉండడం, కబ్జాలో వేరే చోట ఉండడం, రికార్డుల్లో ఒకరు ఉంటుండగా, క్షేత్రస్థాయిలో మరొకరు ఉంటూ నానా ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి సమస్యలన్నీ భూ రీ సర్వేతే పరిష్కారానికి నోచుకుంటాయని ఎమ్మెల్యే తెలపిపారు. రైతులు భూ రీ సర్వేకు సహాకరించాలని సూచించారు. లక్ష్మీనారాయణపూర్‌లోని సర్వే నంబరు 163లో ఉన్న 720 ఎకరాల భూమిని రీ సర్వే చేయనున్నట్లు సర్వేయర్ మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనిత, యాలాల తహవీల్దార్ గాయత్రి, సర్ కన్వీనర్, మండల మాజీ ఎంపిపి కరణం పురుషోత్తంరావు, సొసైటీ చూర్మన్ గుర్రాల సురేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, గ్రామ సర్పంచు, ఉప సర్పంచు, ప్రజాప్రతినిధులు తదితరలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## ఒపిఎస్ అమలు చేయాలని ధర్నా

**షాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** సీపీఎస్ విదానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దేవిద్రెడ్డి, ప్రధానకార్యదర్శి కృష్ణ అన్నారు. పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఇం దిరాపార్కు వద్ద మహా ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్డీయూ నాయకులు అంజయ్య, నర్సింహులు, సుశీల, శ్రీనివాన్ రెడ్డి, దశరధరెడ్డి, అశోక్, జైపాల్ రెడ్డి, బాజాపాషా, నర్సింహులు, సంజీవకుమార్, జయరాజు, వెంకట రమణ గౌడ్, విజయలక్షి ్మ, గోవిందు, యాదయ్య, రాజేంద్రప్రసాద్, రమచంద్రయ్య, హేమసుందర్, రవినాయుడు. సింహాచలు తదితరులు పాల్గొన్నారు.



తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**కొడంగల్:** కొడంగల్‌లో జరిగిన కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎస్టీయూటీఎస్ జిల్లా అద్యఓఉలు వేణుగోపాల్, డిజి సిపిఎస్‌యూఈ వికారాబాద్ జిల్లా ప్రదాన కార్యదర్శి క్రాంతికుమార్, బసప్ప, విష్ణుకుమార్, గోపినాథ్, కొండన్న, ఉపాధ్యాయులు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కుమార్ ముదిరాజ్ తదితరులు

## అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాదాయశాఖ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ ఎన్. కుమార్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. వెంకటాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం చైర్మన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అక్రమ మట్టి తవ్వకాలను ఖండించారు. దేవాలయానికి చెందిన భూములు ఘట్‌కేసర్ మండలం చందుపట్లగూడెంలో ఉన్నాయి. సర్వేనెంబర్లు 204, 205, 206, 208, 209లలో దాదాపుగా 20 ఎకరాల 23 గుంటల భూమి ఉందని అన్నారు. ఇట్టి భూములను అదే గ్రామానికి చెందిన పలువురు రైతులకు కౌలుకు కేటాయించినట్లు తెలిపారు. ఇట్టి భూముల్లో ఇటీవల గడీల సంజీవరెడ్డి, గడీల ప్రభాకర్‌రెడ్డిలు అక్రమంగా రాత్రివేళల్లో మట్టి తవ్వకాలు జరిపి మట్టిని విక్రయించిన్నట్లు తెలిపారు. ఈ విషయమై ఆలయ ఈవో ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ తాహసిల్దార్ కార్యాలయంలో మట్టి తవ్వకాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. దేవాదాయ భూములను అక్రమణలకు పాల్పడిన, మట్టి తవ్వకాలు జరిపిన చట్టపరమైన చర్యలు తీసుకునేంత వరకు దేవస్థాన కమిటీ, అధికారులు ఉద్యమిస్తారని అన్నారు. దేవస్థాన భూముల రక్షణకు దేవాదాయ కమిటీ కట్టుబడి ఉందని చైర్మన్ కుమార్ ముదిరాజ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో కమిటీ డైరక్టర్ రాయబండి అరుణ్‌తేజ్, స్థానిక నాయకులు డి. బాల్‌రాజ్, సంతోశ్ గౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



## ధారూర్ ఉపాధ్యాయుల మహాధర్నా

**ధారూర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సీపీఎస్ రద్దు, పీఆర్సీ అమలు తదితర డిమాండ్లతో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నాకు ధారూర్ మండలం నుంచి ఉపాధ్యాయులు భారీగా తరలివెళ్లారు. ప్రత్యేక బస్సులు, కార్లు, రైళ్లలో తరలివెళ్లిన దాదాపు 80 మంది ఉపాధ్యాయులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. గత మూడేళ్లుగా సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని, వెంటనే డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని మండల అధ్యక్షులు కే. మాణిక్యం హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో మండల గౌరవ అధ్యక్షులు జీ. మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి టీ. సుదర్శన్, రాష్ట్ర నాయకులు రమేష్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.



## గిన్నిస్‌బుక్‌లో ఘట్‌కేసర్ విద్యార్థులకు చోటు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులకు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఎంఎంసి ఘట్‌కేసర్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన దొడ్డిగర్ల కన్నయ్య కూతురు ప్రసన్థ, కుమారుడు ప్రహర్ష, ఫాస్టర్ దొడ్డిగర్ల యేసు రమేశ్ కుమారుడు రోహన్‌కులకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని మెరిట్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ప్రసన్థ, ప్రహర్ష, ఎన్ఎఫ్‌సీనగర్ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రోహన్‌లు గత ఫిబ్రవరి 2న మిస్టర్ అగస్టిన్ దండిగి వేణుగోపాల్ హలెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా 777 మంది విద్యార్థులలో ప్రసన్థ, ప్రహర్షలు కూడా కీబోర్డు ప్లే చేయడంలో ప్రావీణ్యం సాధించారు. బౌతనియా ప్రార్ధనా మందిరం ఫాస్టర్ యేసు రమేశ్, కల్వరీ మార్గం మినిస్ట్రీస్ బ్రదర్ పాల్ పృథ్వీ, సుజాత పృథ్వీల చేతుల మీదుగా విద్యార్థులు మెడల్స్, రికార్డులు అందుకున్నారు. గాంధీనగర్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులకు వారి ప్రతిభను గుర్తించి గిన్నిస్‌రికార్డ్స్‌లో స్థానం కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**అనురాగ్ యూనివర్శిటీలో**

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీకి చెందిన బీటెక్ థర్డ్ ఇయర్ ఏఐఎంఎల్ విద్యార్థి ఎండీ. అబ్రార్ అన్సార్ తైక్వాండో పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినట్లు డిపార్టుమెంటు హెడ్ ఎ. మల్లిఖార్జున్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తైక్వాండో పోటీల్లో 1212 మంది పాల్గొన్న అతిపెద్ద ఈవెంట్ జరిగిందని తెలిపారు. ఈ పోటీల్లో అబ్రార్ అన్సార్ 30 నిముషాల్లో 11 వేల 475 తైక్వాండో కిక్స్‌తో లిమ్కా బుక్ ఆఫ్ రికార్ట్సులో స్థానం సంపాదించినట్లు తెలిపారు. ఓపెన్ నేషనల్‌లో స్వర్ణ పతకం, ఓపెన్ ఇంటర్నేషనల్‌లో రజత పతకం సాధించినట్లు తెలిపారు. ఏడు సంవత్సరాల సాధనతో బ్లాక్‌బెల్ట్ 1 వ డాన్ పొందినట్లు తెలిపారు. అబ్రార్ అన్సార్ విద్యార్థిని మిగతా విద్యార్థులు స్పూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏఐఎంఎల్ విభాగాధిపతి ఎ. మల్లిఖార్జునరెడ్డి అన్నారు. గిన్నిస్ బుక్‌లో రికార్డు పొందిన విద్యార్థిని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



తైక్వాండో కిక్స్ పోటీల్లో గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థి అబ్రార్ అన్సార్

## రుణాల వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకొండి: ఎండి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులు ఈనెల 30వ తేదీ లోగా వడ్డీ చెల్లించి ఋణాలు రెన్యూవల్ చేసుకోవాలని మేనేజింగ్ డైరక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం తెలిపారు. సొసైటీలో భూమి అభివృద్ధి, ట్రాక్టర్, గేదె, గొర్రె, మైనర్ ఇరిగేషన్ తదితర ఎల్‌టి ఋణాలు తీసుకున్న రైతులు వెంటనే తమ బకాయిలు చెల్లించాలని ఆయన సూచించారు. గడువు తీరిన రుణాలు చెల్లించకుంటే అపరాధ వడ్డీ విధిస్తామని, టిసిఎస్ చట్టం 1964 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎండి పేర్కొన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

**అత్తాపూర్, సెప్టంబరు 1, ప్రభాతవార్త :** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరని అందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అల్పాహార పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడమే మా లక్ష్యమని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఎంఆర్ఓ శంకర్ రాథోడ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించి పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి, వారితో కాసేపు ముచ్చటించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఆయన కూడా అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉదయాన్నే ఆకలితో పాఠశాలకు రాకూడదని, వారంతా ఆరోగ్యకరమైన పోషకాహారంతో ఉత్సాహంగా చదువుకోవాలనే ఉన్నత లక్ష ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతున్నదా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ధనంజయ్ పాల్గొన్నారు.

## జోరుగా లూజ్ సేల్స్

(మొదటి పేజీ తరువాయి)

సీసాపై ..20 నుండి ..50 వరకు, బీర్లపై ..50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. సీసాల్లోని అసలు మద్యాన్ని తీసేసి నీళ్లు లేదా కల్తీ పదార్థాలు కలిపి లూజ్ విక్రయాలు జరుపుతున్నారు. ఈ కల్తీ మద్యం తాగి పలువురు తీవ్ర అరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. సర్కారు నిర్దేశించిన టార్గెట్లను చేరుకోవాలనే ధ్యేయంతో ఎక్సైజ్ అధికారులు అక్రమ విక్రయాలపై కన్నుమూసి ఉంచుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమాజంపై పడుతున్న చెడు ప్రభావాన్ని పట్టించుకోకుండా, కేవలం ఆదాయంపైనే దృష్టి పెట్టడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

**కఠిన చర్యలు తప్పవు: ఎక్సైజ్ ఎస్సై రవికుమార్**

గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే సహించేది లేదు. ఇప్పటికే పలు గ్రామాలపై దాడులు చేసి కేసులు నమోదు చేశాం. ముఖ్యంగా లూజ్ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్టు షాపుల సమాచారం తెలిస్తే ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

## సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసారనేది అవాస్తవం

**పెద్దేముల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పెద్దేముల్ సాంఘీక గురుకుల పాఠశాల నుంచి గత మూడు రోజల క్రితం పదవ తరగతి విద్యార్థి సాంద్ర అక్షిత్ హస్టల్‌లో ఉండటం ఇష్టంలేక పారిపో యాడని ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు శివకుమార్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేయడం వల్ల సాంద్ర అక్షిత్ పారిపోయాడని కథనాలు రావడం అవాస్తవమని అన్నారు. సాంద్ర అక్షిత్‌కు హస్టల్‌లో ఉండటం ఇష్టంలేక పీటీ సమయంలో నడుచుకుంటు వెళ్ళిపోయాడని, గోడ దూకి పారిపోలేదని అన్నారు. సాంద్ర అక్షిత్ తల్లి దండ్రులు హస్టల్‌కు వచ్చి ట్రంక్ బాక్స్, లగేజి బ్యాగు కూడా తీసుకెళ్లారని అన్నారు. ప్రస్తుతం సాంద్ర అక్షిత్ వారి తల్లిదండ్రుల వద్దనే ఉన్నాడని వారు తెలిపారు.

## చేయూత పెన్షన్లకు దరఖాస్తు గడువు పొడిగింపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం చేయూత పిన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవటానికి ఈ నెల (సెప్టెంబరు) 15వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు, అర్హులైన వారు ఉంటే పిన్షన్ల కోసం ధరఖాస్తులు చేసుకోవాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిఆర్‌డిఓ సాంబశివరావు సూచించారు. ఆగస్టు 31వ తేదీ వరకు చివరి గడువు ఉండటంతో దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకు ధరఖాస్తులు చేసుకోవటానికి పొడిగించి అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటి వరకు చేయూత కొత్త పిన్షన్ల కోసం వితంతు మహిళలు 16,653మంది, ఒంటరి మహిళలు 1,614 మంది, దివ్యాంగులు (వికలాంగులు) 5,558మంది, వ్యైవెర్స్ 102మంది, టాడి టాపర్స్(గీతకార్మికులు) 326మంది మొత్తం ధరఖాస్తులు 24,253మంది ధరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఇక ఈ నెల 15వ తేదీ వరకు పిన్షన్ల ధరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచినందున అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రూ.3 లక్షల సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు

**షాద్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** అనారోగ్యంతో చికిత్స పొందుతున్న షాద్‌నగర్‌కు చెందిన మెరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా రూ.3 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన లోకల్ ఆర్డర్ కాపీని ముఖ్యమంత్రి కార్యాలయం నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌కు పంపింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఈ నెల 22న ముఖ్యమంత్రి కార్యాలయానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ సహాయం మంజూరైనట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, ముబారక్ అలీ ఖాన్ తదితరులు ఉన్నారు.



## పండరి ఎడిసికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానం

**షాద్‌నగర్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** ఆర్టీసీలో 37 ఏళ్ల పాటు విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నల్లా పండరి ఏడీసీను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. ఆయన రిటైర్మెంట్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షి ంచారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** తాళం వేసి ఉంచిన ఒంటరి మహిళ ఇంట్లో చోరీ జరిగిన ఘటనలో శంకర్ పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే అయ్యప్పరెడ్డిగూడకు చెందిన పంకంటి సరస్వతి(55) రాఖీ పండుగ సందర్భంగా మోమిన్ పేట్ లోని, దుర్గం చెరువు గ్రామానికి కూతురు అల్లుడితో కలిసి వెళ్లినది. అయితే ఈరోజు 1న ఉదయం పక్కింటి వారు ఫోన్ చేసి దొంగతనం జరిగిన విషయం తెలిపినారు. ఇంటి యజమాని వచ్చి చెక్ చేసుకోగా ఇంట్లో ఉన్న 3 తులాల బంగారం, అందాజ 30 తులాల వెండి, కొంత నగదు పోయి నట్టుగా ఫిర్యాదు, పోలీసు వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మండల విద్యాధికారిగా జైపాల్‌రెడ్డి

**కుల్కచర్ల, సెప్టంబరు1 ప్రభాతవార్త :** మండల విద్యాధికారిగా జైపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అయన ఇంతకు మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో ప్రాధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మండలంలో విద్యాధికారి పోస్టు ఖాళి ఉండడంతో మండల విద్యాధికారిగా జిల్లా అధికారులు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

ప్రభు త్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైనవిద్య అందేలా కృషి చేయాలని పలువురు ఆకాక్షించారు. పాఠశాలల్లో మౌలక వసతుల కల్పన, విద్యార్థుల హాజరు పెంపు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యా పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన మండల విద్యాధి కారి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

**SUIT NOTICE**
**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT MEDCHAL**
**O.S. NO. 566 OF 2026**
BETWEEN
**Smt Gadwala Swetha alias Kolisheti Swetha & Others** ...Plaintiff
AND
**The Tahsildar & Others** ...Defendants
To
1. The Tahsildar, Medchal Mandal, Medchal-Malkajgiri District
2. Sub-Registrar, Medchal, Medchal-Malkajgiri District.
3. All concern ...Defendants

WHEREAS the Plaintiffs have filed the above suit for declaration as Legal Heirs of Late Gadwala Anand Reddy & Late Gadwala Vijaya, and the service of Summons addressed to you and all those who are concerned. Therefore, please take notice that the above suit now stands posted to **07/09/2026 at 10.30 AM** for your appearance in the above Court. In default thereof, the matter will be decided exparte.

//By order of the Court//
**K BHANODAYA**
**ADVOCATE**
Flat No. 105, 2nd Floor, Shiva Ganesh Nilayam, Beside Medchal Court Complex, Medchal Municipality, Medchal Malkajgiri District 501401



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నేతలు

## దాడులతో బిజెపిని భయపెట్టలేరు

**కొత్తూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులను విధానపరంగా ఎదుర్కోవాల్సింది పోయి దాడులకు పాల్పడటం కాంగ్రెస్ పార్టీ అసహనానికి నిదర్శనమని రంగారెడ్డి జిల్లా బిజెపి కోశాధికారి అమడాపురం నరసింహ గౌడ్, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు నాగరాజు చారి, కొత్తూరు మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు అమడాపురం రణధీర్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. నాంపల్లిలోని బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ, మంగళవారం కొత్తూరు మున్సిపల్ పార్టీ ఆఫీస్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావును నల్గొండ జిల్లాకు వెళ్లకుండా గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని వారు అన్నారు. నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడి ఆయన తల్లిని గాయపరచడం అత్యంత దుర్మార్గమైన చర్యగా అబి వర్ణించారు. అదేవిధంగా బిజెపి రాష్ట్ర కార్యాలయ గేటుకు నల్లరంగు పూయడం వంటి చర్యలు రాజకీయ సంస్కృతికి విరుద్ధమని మండిపడ్డారు. తెలంగాణలో బిజెపికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ పార్టీ అసహనంతో అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. దాడులు, బెదిరింపులతో బిజెపినాయకులు, కార్యకర్తలను భయపెట్టడం కాంగ్రెస్ వల్ల కాదు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిజెపి శ్రేణులు ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతాయి అని స్పష్టం చేశారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలకాలని బిజెపినాయకులు డిమాండ్ చేశారు. రాజకీయ భేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిట్టల శేఖర్ గౌడ్, శ్రీశైలమప్ప, సందీప్ సింగ్, ఉపాధ్యక్షులు ఏనుగు విజయభాస్కర్ రెడ్డి, కార్యదర్శి శివకుమార్ నాయక్, ఏనుగు రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని భయపెట్టాలని చూస్తే అది పగటికలే

**యువజన కాంగ్రెస్ గూండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నాం**

**కేశంపేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** రాజకీయంగా ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే ప్రతిపక్షంపై దాడులకు పాల్పడటం సిగ్గుచేటని బిజెపి షాద్నగర్ నియోజకవర్గ ధార్మిక సెల్ కన్వీనర్ పసుల నరసింహ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో నిరసనకు హక్కు ఉంది.. కానీ దాడులు, గూండాగిరికి హక్కు లేదు. ప్రజలప్రశ్నలకు సమాధానంచెప్పకుండా రాజకీయ ప్రత్యర్థులనుఅణచియాలని చూడటంకాంగ్రెస్ ప్రభుత్వచేతకానితనానికి నిదర్శనం అని పసుల నర్సింహ యాదవ్ అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని, ఆ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు ఇలాంటి ఘటనలకు పాల్పడటం సరికాదని ఆయన విమ ర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేసి, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపిని భయపెట్టాలని కాంగ్రెస్ చూస్తే అది పగటి కలే. బిజెపి కార్యకర్తల సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. ప్రజాస్వామ్యబద్ధంగా మా పోరాటం కొనసాగుతుంది అని పసుల నర్సింహ యాదవ్ స్పష్టం చేశారు.

## ప్రమాద బాధితుడికి సర్పంచ్ ఆర్థిక సాయం

**మాడ్గుల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఆర్కపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల స్టీవెన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, విషయం తెలుసుకున్న సర్పంచ్ కల్లు



స్టీవెన్‌ను పరామర్శింస్తున్న సర్పంచ్

భాగ్యలక్ష్మి ్ర తిరుపతి రెడ్డి బాధితుడిని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే ఆర్కపల్లి గ్రామ చెందిన ఏర్పుల స్టీవెన్ హైదరాబాద్ నుంచి ఆర్కపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో స్టీవెన్ కాలుకు తీవ్ర గాయమైవిరిగింది. ప్రమాదం అనంతరం ఆయనను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వైద్యుల సలహా మేరకుకు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మి ్ర తిరుపతి రెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు ధైర్యంచెప్పారు. ఈ సందర్భంగా స్టీవెన్ కుటుంబానికి రూ. 5వేలుఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కనగంటి కొండ రెడ్డి, చింటు, తోలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక దాడులతో భయపెట్టాలని చూస్తే మరింత పోరాటంచేస్తాం

**బిజెపి రాష్ట్ర కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్య విరుద్ధం**

**పరిగి , సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విరుద్ధమని , పార్టీ కార్యాలయంపై, నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షులపై జరిగిన దాడిని వికారాబాద్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు బందయ్య ఖండించారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నాయకులపై దాడులకు పాల్పడటం సమంజసం కాదని బందయ్య అన్నారు.. భౌతిక దాడులతో బిజెపి నాయకులను భయపెట్టాలని చూస్తే ప్రభుత్వంపై మరింత పోరాటం చేస్తామని తెలిపారు.. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలు తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు..

## హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులు పరుగులు పెట్టాలి

**-నాణ్యతలో రాజీ వద్దు - ప్రతి వారం పనుల పురోగతి కనిపించాలి -ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్**



ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలిస్తున్న సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

**దుద్యాల్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** విద్యార్థులకు అత్యాధునిక విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో హకీంపేట్‌లో చేపడుతున్న ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఐఏఎస్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆయన హకీంపేట్‌లోని ప్రతి నిర్మాణ సైట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్షించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, వెటర్నరీ కళాశాలలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలను నిర్ణయించిన లక్ష్యాల మేరకు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి వారం నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనుల పురోగతి ఉండాలని, నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని, కాంపౌండ్ వాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కళాశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఈడబ్ల్యూఐడీసీ చీఫ్ ఇంజనీర్ షఫీ, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ కిషన్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాగారం బస్తీ దవాఖానాలో కనీస వైద్య సదుపాయాలు కల్పించాలి

**కీసర, సెప్టెంబరు1, ప్రభాతవార్త:** నాగారం బస్తీ దవఖనాలో కనీస వసతులు కల్పించాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం బస్తీ దవఖానాను సందర్శించి బిపి మిషన్‌ను విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో కనీసం బిపి పరీక్షించే మిషన్ కూడా అందుబాటులో లేదని అలాగే బిపి టాబ్లెట్లు, షుగర్ టాబ్లెట్లు పరిపడలేవన్నారు. ఒక రోజుకు 60 నుండి 70 మంది పేషెంటులన ఆసుపత్రికి వస్తున్నారని వారికి అవసరమైన మందులు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడాల్సిన బస్తీ దవాఖానాలో కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం బాధకరమని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రజల ఆరోగ్య అవసరాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించాలని బిజేపి, బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, మందులు అందించకపోతే సంబంధిత



నాగారం బస్తీ దవాఖానాలో బిపి మిషన్‌ని విరాళం ఇస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

అధికారుల దృష్టికి సమస్యను మరింత బలంగా తీసుకెళ్తామని తెలిపారు. డిఎంహెచ్ఓ ఆనంద్ బస్తీ దవఖానాను స్వయంగా పరిశీలించి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు అన్నంరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలి

**దుద్యాల్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దుద్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగుల పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతపై ఆందోళనలు ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. ఉద్యోగుల దీర్ఘకాలిక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఓపీఎస్ అమలుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీటీ శివకుమార్, ఆర్ఐ నవీన్‌కుమార్, సర్వేయర్ మహేష్‌కుమార్, జీపీఓలు గోపాల్, రమేష్, శ్రీనివాస్, నరసింహులు, పక్కీరప్ప, రికార్డు అసిస్టెంట్



తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మారుతి, ఉషప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**జిల్లేడు చౌదరి గూడెం, సెప్టెంబర్ 1 , ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు మండల కేంద్రంలోని తహసీల్దారుకు టీఎస్‌యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ నరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను తక్షణమే మంజూరు చేయాలని అన్నారు. , 2వ పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని అన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కొన్ని ముఖ్యమైన సమస్యల కారణంగా ఉద్యోగులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ ప్రధాన డిమాండ్లను వివరించారు.

**1. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలి**

ఉద్యోగుల పదవీ విరమణ అనంతర భద్రతను దృష్టిలో ఉంచుకొని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్/ఎన్‌పిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపిఎస్)ను పునరుద్ధరించాలి.

**2. పెండింగ్‌లో ఉన్న 6 డిఎలను తక్షణమే మంజూరు చేయాలి**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం దృష్ట్యా ఉద్యోగులకు రావాల్సిన 6 పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు

చేసి, తగిన అరియర్స్‌తో సహా విడుదల చేయాలి.

**3. 2వ పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి**

ఉద్యోగులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న ....2వ పే రివిజన్ కమిషన్ తక్షణమే అమలు చేసి, ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అమలులోకి వచ్చే తేదీ నుండి వర్తింపజేసి అరియర్స్‌తో సహా చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఈ జెఎసి నాయకులు జామ కుశాల్, బొడ్డు రవి, సునీతా , లీలా మోహన్ నాయక్, మారోజు ప్రకాష్, రాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ బోనాలు

**-కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..**

**శంషాబాద్ సెప్టెంబరు1, ప్రభాతవార్త :** మహేశ్వరం మండలం పరిధిలోని రావిరాల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవాస్థానంలో 43వ వార్షిక బోనాలు మరియు కల్యాణ మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి ఆలయ ఫౌండర్, ట్రస్ట్ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సూర్యగిరి ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు మరియు భక్తులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో విద్యార్థుల గళం..!

**చేవెళ్ల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** చేవెళ్ల ప్రాంతంలో విద్యార్థుల వసతి గృహాల నిర్మాణంలో జరుగుతున్న తీవ్ర ఆలస్యంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు. "విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు", వెంటనే హాస్టల్ నిర్మాణం ప్రారంభించాలి" అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. 2018 సంవత్సరంలోనే ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలు మంజూరు అయినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అద్దె గృహాల్లో మౌలిక సదుపాయాల లేమి, భద్రత సమస్యలు, చదువుకు అనుకూల వాతావరణం లేకపోవడం వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ సమస్యపై స్పందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదు? ఇంకా ఎంతకాలం నిరక్ష ్యం కొనసాగుతుంది?" అని ప్రశ్నిం చారు. వెంటనే వసతి గృహాల నిర్మాణాన్ని ప్రారంభించి, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేసి రోడ్డు దిగ్బంధాలు, భారీనిరసనలు, చివరికి నిరవధిక నిరాహార దీక్షలకు కూడా దిగుతామని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, విద్యార్థి నాయకులు, పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మేడ్చల్ రింగురోడ్డుపై ప్రమాదం

**ఒకరు మృతి**

**మేడ్చల్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ చెన్నై నుంచి ప్లైవుడ్ లోడుతో మియాపూర్‌కు మేడ్చల్ సమీపంలోని ఔటర్ రింగురోడ్డుపై వెళుతున్న లారీ వర్షం రావడంతో రింగు రోడ్డులో పక్కకు ఆపుకుని ప్లైవుడ్ తడవకుండా ఉండాలని తార్పాలిన్ కప్పడానికి బీహారీ రాయ్ (35) లారీపైకి ఎక్కాడు. అదే సమయంలో వెనుక నుండి వచ్చిన మరో లారీ వేగంగా ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీపై ఉన్న బీహారీరాయ్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నర్సు హత్యపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

**శంషాబాద్, సెప్టెంబరు1, ప్రభాతవార్త :** ఆదివాసీమహిళ శిరీష దారుణహత్య ఘటన తీవ్రంగా కలచి వేసిందని, ఈ ఘటనపై సమగ్రంగా మరియు వేగవంతమైన దర్యాప్తుచేపట్టి పూర్తి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఏబీవీపీ తెలంగాణ డిమాండ్ చేసింది. మంగళవారం ఈ మేరకు ఏబీవీపీ శంషాబాద్‌శాఖ ఆధ్వర్యంలో డీసీపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేసులో నిందితుడిగా పేర్కొంటున్న శానాద్ ఉల్లా ఖాన్‌పై అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల ఆధారంగా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి రాజకీయ, సామాజిక లేదా ఇతర ఒత్తిళ్లకు తావులేకుండా దర్యా ప్తు జరిపి, కేసుకు సంబంధించిన అన్ని సాక్ష్యాలను భద్రపరచాలని డిమాండ్ చేశారు. అలాగే కేసులోని సాక్షులు, బాధిత కుటుంబ సభ్యులకు అవసరమైన భద్రత కల్పించాలని, దర్యాప్తును కాలయాపన లేకుండా పూర్తి చేసి, నిందితుడు దోషిగా నిర్ధారణ అయిన పక్షంలో చట్టం ప్రకారం కఠినమైన శిక్ష పడేలా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కోరింది. అదేవిధంగా, ఘటనకు సంబంధించి ప్రైమ్ కేర్ హాస్పిటల్ పాత్రపై సమగ్ర విచారణ చేపట్టి, ఆసుపత్రి యాజమాన్యం లేదా సిబ్బంది నిరక్ష ్యం, తప్పిదం ఉన్నట్లు తేలితే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. మహిళలపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత ప్రాంతాల్లో మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరింది. ఈ కార్యక్రమంలో శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కోటి ప్రదీప్, రోహిత్, పవన్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## దుర్గంచెర్వు గ్రామంలో ఘనంగా జలమహోత్సవం

**మోమిన్‌పేట్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** గ్రామాలలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే మిషన్ భగీరథ నీరే సురక్షితమైనవని అందుకొరకు ప్రభుత్వం లక్షలకోట్లు ఖర్చుపెట్టి ప్రజలకు సురక్షితమైన మిషన్ భగీరథ నీరు త్రాగాలని సర్పంచ్ లావణ్య మోహన్, మిషన్ భగీరథ ఏఇ అభిషేక్ తివారి లు పేర్కొన్నారు. జల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని దుర్గంచెర్వు గ్రామంలో గ్రామ సర్పంచ్ లావణ్య మోహన్ ఆధ్వర్యంలో జలమహోత్సవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఆద్వర్యంలో జలమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా వారు మిషన్ భగీరథ త్రాగునీటి ట్యాంకు దగ్గర కొబ్బరికాయ కొట్టి జల మహోత్సవం ప్రారంభించారు. నీటి ట్యాంకు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతు మిషన్ భగీరథ నీరు చాలా శ్రేష్టమైనదని ప్రజలందరూ త్రాగునీరుగా మిషన్ భగీరథ నీరు ఉపయోగించాలని అన్నారు. బావి నీరు, బోర్ నీరు, ఫిల్టర్ నీళ్లకు తేడా ఎలా ఉంటాయో ప్రజలకు అర్థమయ్యే విధంగా సూచించారు. అలాగే గ్రామస్తుల అభిప్రాయాలనుకూడా త్రాగునీటిపై ఆడిగి తెలుసుకొని, ప్రత్యక్షంగా మిషన్ భగీరథనీటి గురించి అందరికి అర్థమయ్యే విధంగా వివరించారు. మిషన్ భగీరథ నీరు గురించి గ్రామస్తులకు పూర్తి అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ నీళ్ల చాలా శ్రేష్టమైనవిఅన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య మోహన్, ఉపసర్పంచ్ సరియాబి, వార్డ్ సభ్యులు గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మి, గ్రామ పంచాయతి సిబ్బంది, పంచాయతి కార్మికులు మిషన్ భగీరథ సిబ్బంది మోహన్, ప్రశాంత్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సంతాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల నుండి పత్రాలను తీసుకుంటున్న దృశ్యం

## సంతాపూర్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ

**-ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టి, ఓటర్లకు అవగాహన కల్పించిన అధికారులు**

**కేశంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలో సంతాపూర్ గ్రామంలో మంగళవారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారిగా ఆర్ఐ విజయలక్ష్మి పాల్గొని ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ అవసరమైన సవరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవడం, తప్పులు ఉంటే సవరణలు చేయించుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిపిఓ గిరీష్ కుమార్, సర్పంచ్ బర్కమ్ యాదయ్య, ఎండీ సాజిత్, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, అశోక్, కావాలి కృష్ణయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సూచించారు.



గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్, పాలకవర్గ సభ్యులు

## నిర్దవెల్లిలో వికసిత్ భారత్‌పై గ్రామసభ

**కేశంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమంపై గ్రామ సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపివో అజీజ్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027-28 సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించడంపై ప్రధానంగా చర్చించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, వివిధ ప్రజా అవసరాలపై సభలో చర్చించి, ప్రాధాన్యత ఆధారంగా పనులను గుర్తించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, విజయ్ కుమార్, ఉపసర్పంచ్ సఫూర అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, రమేష్ నాయక్, మంజుల జంగేశ్, రిజ్వాన బేగం మోహిజ్, వెంకటమ్మ మల్లయ్య, ఐకెపి సీసీపరంధాములు, అంగన్వాడి టీచర్లు, ప్రేమలత, సులోచన, ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య, వివో గోపాల్ నాయకులు ముత్యాలు, చాకలి జంగయ్య, వాజీద్, బోడ మల్లేష్, రాజేందర్, గణపతి, నుజ్జు, సాయి, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి

**ఎమ్మెల్సీ సొంత నిధులతో**

## వేముల్ నర్వ గ్రామంలో ఐమాక్స్ లైట్ల ఏర్పాటు

**కేశంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్ల ప్రారంభోత్సవాన్ని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా తమ సొంత నిధులతో అన్ని గ్రామాలలో హైమాక్స్లైట్ల ఏర్పాట్లు చేపట్టామని ఆయన అన్నారు. వేముల నర్వ గ్రామంలో గుడి స్కూల్ మజీద్ కట్టించటానికి బాధ్యత నాదే అని అన్నారు. యువత అక్క చెల్లెలు అన్న తమ్ముళ్లు మేలుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రంలో , వేములనర్వ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నర్సిములు, కేశంపేట్ సర్పంచ్ బొజ్జం సంతోష, శ్రీశైలం యాదవ్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, ఇప్పలపల్లి సర్పంచ్ మంజుల జంగయ్య, లింగందాన సర్పంచ్ నాగిల్ల వెంకటేష్, కమ్మదనం సర్పంచ్ లతాకిరణ్ గౌడ్, తూర్పుగడ్డ తండా థౌర్య నాయక్, భైర్కాన్‌పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్, మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, శేఖర్ పంతులు, యారం శేఖర్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, ప్రభాకర్ రెడ్డి, మీనమోనిపల్లి సత్యనారాయణ, క్రిష్ణయ్య, మాజీ ఎంపీటీసీ కోటేశ్వర్, ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి, సహదేవ్, మాజీ ఉపసర్పంచులు సుదర్శన్ గుప్త, నాయకులు వేములనర్వ మల్లేష్, తుకారాం, మురళి, జగన్ రెడ్డి, క్రిష్ణ, సత్యనారాయణ, సాయిరాం, అబి శ్రీను, వేములనర్వ, చౌదర్‌గూడ గ్రామస్థులు, మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నాగం వర్షిత్ రెడ్డి కుటుంబ సభ్యులపై**

## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**మాడ్గుల, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై, వారి తల్లిపై, కుటుంబ సభ్యులపై జరిగినట్లు పేర్కొంటున్న దాడి, దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దండు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విభేదాలు ఉండటం సహజమని, అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత కక్షలకు ఆపాదించి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజకీయ నాయకులపై ఉన్న విభేదాలను వారి కుటుంబ సభ్యులపై ప్రదర్శించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని దండు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చని, వాటిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కానీ కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం, దురుసుగా ప్రవర్తించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని స్పష్టం చేశారు. డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి కుటుంబ సభ్యులకు తగిన భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను వెలికితీసి, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో హింసకు, బెదిరింపులకు, వ్యక్తిగత దాడులకు తావు ఉండకూడదని దండు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలను రాజకీయంగానే పరిష్కరించుకోవాలని, కుటుంబాలపైకి వెళ్లి దాడులు చేయడం వంటి సంస్కృతికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులపై దాడులు జరిగితే బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని దండు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులపై దాడులను సహించేది లేదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి దాడుల రాజకీయాలను అరికట్టాలి అని ఆయన పిలుపునిచ్చారు.

## మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి నిధులు మంజూరుచేయండి

**..రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం**

**..మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం**

**శామీర్‌పేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపాల్టీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మూడుచింతపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం రాష్ట్ర మంత్రి మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేయటంతో ఆయన మంత్రిని కలిసి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. మూడుచింతలపల్లి కొత్తగా మున్సిపాల్టీ అయినందున ప్రభుత్వం నిధులు కేటాయించి మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్‌లో నిధుల కొరత ఉన్నందున వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. 24వార్డులు ఉన్నందున వివిధ గ్రామాలు అన్ని మున్సిపాల్టీ పరిధిలో ఉన్నట్లు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించటానికి, అభివృద్ధి పనులు చేపట్టటానికి ప్రభుత్వం నిధులు డిఎండిఎఫ్ నుంచి మంజూరు చేయాలని దోసకాయల వెంకటేశం కోరారు.



మూడుచింతలపల్లి మున్సిపాల్టీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేసిన ఎంసిపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం

## జోనల్ స్థాయి క్రీడా పోటీలు షురూ..

**..విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగ ఉండాలి**

**..చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి**

**..అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి**

**శామీర్‌పేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగ ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించటానికి దృష్టిని సారించాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం శామీర్‌పేట ఉమ్మడి మండల జోనల్ స్థాయి 70స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లిలో విజేత టెక్నో స్కూల్‌లో జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమైనాయి. విద్యార్థుల క్రీడాకారుల నుంచి మార్చ్‌ఫాస్ట్‌లో చైర్‌పర్సన్ గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలై ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. సెల్‌ఫోన్లను వీడి మైదానాల్లో ఆటలు ఆడితే శారీరకంగా, మానసికంగా దృఢత్వం సిద్ధించి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. విద్యార్థులు చదువు, క్రీడలపైనే ఎక్కువగా దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఎస్‌జిఎఫ్ జోనల్ కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. 210జట్లకు చెందిన వారు సుమారు 2,500మంది వరకు క్రీడాకారులు (విద్యార్థులు) పాల్గొనటం జరుగుతుందన్నారు.

ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాధవరెడ్డి, మూడుచింతలపల్లి ఎంఇఓ భాగ్యమణి, ఎస్‌జిఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అరుణజ్యోతి, కౌన్సిలర్లు దీపికవరప్రసాద్‌రెడ్డి, దీపికాసాయి, విజేత టెక్నోస్కూల్ చైర్మన్ రాంరెడ్డి, కరస్పాండెంట్ రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగలక్ష్మి, గోపాల్‌చారి, వీరారెడ్డి, జ్యోతి, కవిత, మదన్‌మోహన్‌రెడ్డి, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.



తుర్కపల్లిలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరుల దృశ్యం



క్రీడాపోటీల ప్రారంభం సందర్భంగా మార్చిఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థుల (క్రీడాకారులు) దృశ్యం

## ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలి

**కేశంపేటలో భక్తిశ్రద్ధలతో చాతుర్మాస్య పూజలు**

**కేశంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** కేశంపేట గ్రామంలో కిషన్ ప్రభుధర్మ ప్రచార సమితి మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ ఆధ్వర్యంలో కేశంపేట గ్రామంలో నిర్వహిస్తున్న చాతుర్మాస్య యజ్ఞం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ద్వాదశి వరకు యథావిధిగా ఈ యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. యజ్ఞంలో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ధార్మిక సందేశాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు భక్తులు యజ్ఞ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాశీ నరసింహ, టి. ప్రభాకర్ రెడ్డి, జి. ఆంజనేయులు, కే. నర్సింలు, పి. శ్రీను, ఈ. రాఘవేందర్, కే. రమణమ్మ, బాబు, జి. మానెమ్మ, జి. ఆంజనేయులు, మాజీ సర్పంచ్ పి. వెంకట్ రెడ్డి, గుడి చైర్మన్ పిల్లి అమరేష్ తదితరులు హాజరై యజ్ఞంలో పాల్గొన్నారు. చాతుర్మాస్య యజ్ఞం ద్వారా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోందని, ప్రజలు భక్తిభావంతో పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు చిన్నారులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చతుర్మాస్య సందర్భంగా పూజలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా ఎల్లమ్మ దేవత బోనాలు!

**కొందుర్గు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవతకు మంగళవారం నాడు భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక గీత కార్మికులు గౌడన్న వేషాధారణతో కల్లు ఘట్టం మెత్తుకొని ర్యాలీగా దేవాలయానికి చేరుకొని ఘటం సమర్పించి మొక్కుబడి తీర్చుకున్నారు. వారి వెంటనే గ్రామానికి చెందిన మహిళలు తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో ముస్తాబు చేసిన బోనాలను ఎత్తుకొని ర్యాలీగా వచ్చి బోనాలతో ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. బోనాల ర్యాలీ ముందు పోతురాజుల విన్యాసాలు శివసత్తుల పూనకాలు, యువకుల డాన్సులు గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం నుండి అనేకమంది భక్తులు దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నైవేద్యాలు సమర్పించి అమ్మవారి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనేకమంది అమ్మవారికి కోడిపుంజులను బలి ఇచ్చారు. బోనాలను పురస్కరించుకొని దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో,పచ్చని తోరణాలతో ముస్తాబు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్ తో పాటు పంచాయతీ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, మాజీ మాజీ సర్పంచ్ ఆదిలక్షి ్మ యాదయ్య, వివిధ పార్టీల నాయకులు కందుకముల రాములు గౌడ్, ఈసారి సత్యనారాయణ, బస్వామోని శివశంకర్, జగదీశ్వర్ గౌడు, లక్ష ్మయ్య గౌడ్. సుధాకర్ గౌడ్, కృష్ణయ్య గౌడ్, ఈశ్వరయ్య గౌడ్ ఇ.అశోక్ గౌడ్ వేణుగోపాల్ గౌడ్, కొమరబండ శ్రీశైలం, కావలి వెంకటయ్య, గౌడ సంఘం అధ్యక్షులు ఎంకేపల్లి రమేష్ గౌడ్, తోపాటు యువకులు గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బోనాలతో ప్రదక్షణలు చేస్తున్న భక్తులు

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి

**పరిగి టౌన్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పరిగి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష ్యంగా పనిచేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలుఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. జలసిరి కార్యక్రమం కింప్రతి ఇంటికి సోక్‌పిట్ ఏర్పాటు 6,500అవసరమైన ప్రాంతాల్లో ఊరికి ఊటకుంట ఏర్పాటువర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడంతో పాటు, ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే నీటి కొరతను తగ్గించేందుకు ఈ కార్యక్రమాలను గ్రామాల్లో విస్తృతంగా అమలు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మహిళలు, కుటుంబ సంక్షేమం కోసం మహాలక్షి ్మ పథకం, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ కుటుంబ బీమా, కళ్యాణమస్తు, షాదీ ముబారక్ తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, పంటల బోనస్, ధాన్యం కొనుగోళ్ల వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. అదేవిధంగా నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్లు, ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, బీసీ మహిళలకు కుట్టు మిషన్లు, ఎస్సీ–ఎస్టీ, మైనారిటీ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యమని ఎమ్మెల్యే తెలిపారు. పరిగి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. కొందుర్గ్–పరిగి–లక్షీ ్మదేవిపల్లి ప్రాజెక్టు భూసేకరణ కోసం 587 కోట్లు మంజూరు కాగా, సుమారు 1,512 ఎకరాల భూసేకరణ చేపట్టే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పరిగి మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల అభివృద్ధి కోసం 20 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పరిగి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి 27 కోట్లు మంజూరు చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేలా ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిగిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి 200 కోట్లు కేటాయించి, విద్యార్థులకు ఆధునిక విద్యా మౌలిక వసతులు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పరిగి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పరిగి–షాద్‌నగర్, పరిగి–వికారాబాద్ 4లేన్ రోడ్ల ప్రతిపాదనలు/అభివృద్ధి, బీటీ రోడ్లు, సి సి రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతుల ద్వారా రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ప్రభుత్వ పథకం అర్హులైన ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, జెడ్పి సీఈవో సుధీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయాబ్, . ఎంపిడిఓ హరిప్రియ రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిజెపికి రోజులు దగ్గరపడ్డాయి

**డిసిసి అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్**

**వికారాబాద్, ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ మండిపడ్డారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై కక్షపూరితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ, ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఘటనకు బాధ్యులైన బిజెపి కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐసిసి పిలుపు మేరకు మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై కక్షపూరితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. బిజెపి పార్టీ దేశంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజల పట్ల వివక్ష చూపడం హేయమైన చర్య అని విమర్శించారు.

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఘటనకు బాధ్యులైన బిజెపి కార్యకర్తలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన హెచ్చరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు సంతోష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గద్దం అనన్య, ఏఎంసీ చైర్మన్లు శ్రీనివాస్ ముదిరాజ్, వడ్డే శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు కిషన్ నాయక్, చిగుళ్లపల్లి రమేష్, మహిపాల్ రెడ్డి, ఉత్తమ్ చంద్, అమీర్ అబ్దుల్లా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సతీష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంతోష, మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా సలావుద్దీన్ హైమద్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.




వికారాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**సర్పంచ్ సొల్లు రంగమ్మ**

**తలకొండపల్లి, సెప్టెంబర్ 1,ప్రభాత వార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గ్రామప్రజలు సద్వినియం చేసుకోవాలని చంద్రధన గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ అన్నారు మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వికాసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ పై ప్రత్యేక గ్రామసభ సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి టెక్నికల్ అసిస్టెంట్ సువర్ణ మాట్లాడుతూ రైతులు. ఫారం ఫండ్స్. ఇంకుడు గుంతలు పండ్లతోటలు కోళ్ల ఫామ్స్ పశువులపాక వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డు నిర్మాణం. చేపల పెంపకం నీటి ఊట కుంటలు పశువుల తొట్టి. కమ్యూనిటీ ప్రాజెక్టు కింద మిల్క్ సెంటర్స్. గోదాములు మహిళా సంఘాల భవనాలు నిర్మాణం చేపట్టుకోవచ్చని కావాల్సిన రైతులు ఐదు ఎకరాల లోపు వ్యవసాయ పొలం ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి నాయకులు వార్డు సభ్యులు అజయ్. సొల్లు సుధాకర్ గ్రామస్తులు శేఖర్ కృష్ణయ్య శివకుమార్ చెన్నయ్య. మంగలి బిక్షపతి శీను గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పూజ వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల విరాళం

**తలకొండపల్లి, సెప్టెంబర్1,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల పరిధిలోనిచుక్కాపూర్ గ్రామానికి చెందిన అనాథ యువతి లక్నమోని పూజ (ముదిరాజ్) వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించారు. సెప్టెంబర్ 4న తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్షీ ్మ నరసింహ స్వామి దేవాలయంలో పూజ వివాహం జరగనుంది. ఈ సందర్భంగా తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి రూ.10,116, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరు ప్రభాకర్ రెడ్డి రూ.10,116, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాట నరసింహ (ముదిరాజ్) రూ.5,116 విరాళంగా అందించారు. మొత్తం రూ.25,348 ఆర్థిక సహాయం అందించారు. పూజా 12 సంవత్సరాల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన నేపథ్యంలో, ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నాయకులు వివాహ ఖర్చులకు తమవంతు సహాయం అందించారు. అనాథ యువతి వివాహానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులను స్థానిక ప్రజలు అభినందించారు. విరాళాలు అందించిన నాయకులకు పూజా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మాకం. అంజయ్య, శ్రీనివాసులు,కాడిగే.చంద్రకుమార్, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేను కలిసిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్



ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గేను కలిసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, ప్రభాతవార్త:** రాజ్యసభ ప్రతిపక్ష నేత, ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అధికార నివాసంలో మంగళవారం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ కమిటీ హాల్లో జరిగే కామన్వెల్త్ పార్లమెంటరి అసోసియేషన్ కాన్ఫరెన్స్ సన్నాహక సమావేశం కోసం ఢిల్లీ చేరుకున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పలువురు ప్రముఖులను కలిశారు. ఆయన వెంట ఓఎస్‌డీ పి.వెంకటేశం, వికారాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్ తదితరులు ఉన్నారు.

## రాక్‌బాల్ క్రీడాకారుడు గోపాల్ యాదవ్‌ను అభినందించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**మేడ్చల్, సెప్టెంబర్ 1. ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన దక్షి ణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజయానికి విశేషంగా కృషి చేసి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు ఇటబోయిన గోపాల్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా ఎంపీ గోపాల్ యాదవ్‌కు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో భాగస్వామి కావడం అభినందనీయమని, యువత క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల బీజేపీ సీనియర్ నాయకులు రుక్మేందర్ పాల్గొన్నారు.

## 4నుంచి గోకులాష్టమి వేడుకలు

**కొడంగల్,సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని కేశవస్వామి మందిరంలో ఈనెల 4నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు వేడుకల నిర్వహకులు లయన్స్‌క్లబ్ సభ్యులు,సామాజిక కార్యకర్త మురారి వశిష్ట తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే గోకులాష్టమి వేడుకల్లో బాగంగా 4న శుక్రవారం సాయంత్రం 7 గంటలకు పట్టణంలోని శ్రీహరి వశిష్ట నివాసం నుంచి కృష్ణ భగవానుడు కేశవస్వామి ఆలయం వరకు ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అనంతరం రాత్రికి శ్రీకృష్ణుడి జననం, అభిషేకం, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. అలాగే 5న శనివారం శ్రీకృష్ణునికి విశేషఅలంకరణలతో పంమృత అభిషేక పూజలు కొనసాగుతాయన్నారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు బాలగోకులం, డోలారోహణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేగాక 5 సంవత్సరాలలోపు బాలబాలికలకు శ్రీకృష్ణవేశధారణ పోటీలు నిర్వహించి అందులో విజేతలైన 8 మంది చిన్నారులకు 5 గ్రాముల వెడి పథకాలు బహుకరించడం జరుగుతుందన్నారు. 6న ఆదివారం ఉదయం స్వామివారి అభిషేకం,10 గంటలకు పల్లకిసేవ ఊరేగింపు, పెరుగుబసంతం తదితర పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మురారి వశిష్ట కోరారు.

## సర్ ప్రక్రియలో ఓటరు వివరాల మార్పులపై సమగ్ర విచారణకు డిమాండ్

**షాద్‌నగర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో తమ కుటుంబానికి సంబంధించిన ఇంటి పేరు, తండ్రి పేర్లు అనధికారికంగా మారినట్లు ఆరోపిస్తూ అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబం నందిగామ మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుదారుల వివరాల ప్రకారం, 2002 నాటి ఓటరు జాబితాలో "గొల్ల జంగయ్య – తండ్రి లక్ష ్మయ్య, గొల్ల రాములు – తండ్రి లక్ష ్మయ్య" అనే వివరాలు నమోదై ఉన్నాయని తెలిపారు. అయితే 2026 నాటి ఓటరు జాబితాలో అదే వ్యక్తుల పేర్లు "పాలకొండ జంగయ్య – తండ్రి నారాయణ, పాలకొండ రాములు – తండ్రి నారాయణ" గా నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, సంబంధిత భూములు, రెవెన్యూ రికార్డులు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు తదితర అధికారిక పత్రాల్లో పేర్లు, తండ్రి పేర్లలో మార్పులు ఎలా చోటుచేసుకున్నాయనే అంశంపై తమకు అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ మార్పులు ఎప్పుడు, ఎవరి అభ్యర్థన మేరకు జరిగాయి? వాటికి సంబంధించిన దరఖాస్తులు, ఆధార పత్రాలు ఏమిటి? సంబంధిత అధికారులు ఏ విధంగా మార్పులను నమోదు చేశారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని తహసీల్దార్‌ను కోరారు. ముఖ్యంగా 2002, 2026 నాటి ఓటరు జాబితాలను పరిశీలించి, మధ్యలో జరిగిన మార్పులకు సంబంధించిన రికార్డులను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఓటరు జాబితా, రెవెన్యూ రికార్డులు, ఇతర అధికారిక పత్రాల్లోని వివరాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మా పొలానికి దారికి కడ్డీలు ఫెన్సింగ్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**షాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** : మా పొలానికి దారికి కడీలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి పెదవేడు గ్రామానికి చెం దిన రైతులు జినుకుంట్ల గోవర్ధన్ గౌడ్, గౌండ్ల యాదయ్య మంగళవారం తహసీల్దార్ అన్వర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పెదవేడు గ్రామంలోని సర్వే నెంబర్ 90లో మా గ్రామానికి తూర్పున ఉన్న రోడ్డు నుండి సుమారు 35 సంవత్సరాలుగా రాకపోకలు నిర్వహిస్తున్నాము. గ్రామపంచాయితీ వారు ఆ మార్గానికి మట్టి రోడ్డు వేశారు. అయితే మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కలిసి మా పొలాలకు వెళ్లకుండా కడీలు వేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కావున తమరు స్పందించి మా పొలాలకు వెళ్లేందుకు దారిచూడాలని, ఎవరికి సమాచారం ఇవ్వకుండా పెన్సింగ్ వేసిన వారిపై చటరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ ఆన్వర్ స్పందిస్తూ... బుధవారం సర్వేనెంబర్ 90 మరియు పట్టాభూలను పరిశీలించి హద్దులు ఏర్పాటు చేసి దారి సమస్యను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

## ఆ సర్పంచ్.. మహిళా లోకానికే ఆదర్శం

**నందిగామ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** భర్త ఆశయం నెరవేర్చడం కోసం, రాజకీయ ఆరంగ్రేట్రం చేసి అందివచ్చిన మహిళా రిజర్వేషన్ పుణికి పుచ్చుకొని ప్రజలందరి హృదయాలను దోచుకుని రంగాపూర్ సర్పంచ్ గా గెలుపొందారు. సర్పంచ్ ప్యానెల్‌లో పోటీ చేసిన వార్డు సభ్యులు ఎవరు గెలువకపోయినా ఆమె సర్పంచిగా గెలిచి రికార్డ్ సృష్టించింది. అప్పుడున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హయాంలో అభివృద్ధి సంక్షేమ పనులకు శ్రీకారం చుట్టి అందరి మన్ననలను అందుకుంది. సీనియర్ నాయకులు, అభిమానులు పట్టు పట్టడంతో ఆమె మరోసారి పోటీ చేయాల్సి వచ్చింది. హంగు ఆర్భాటం ప్రదర్శించకపోయిన ఆమె, ఒక సామాన్య మహిళగా పోటీలో నిలుచుంది. రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ మృతిని జీర్ణించుకోలేకపోతున్న జనం .

## పార్టీ జెండా మళ్లీ ఎగరేయడమే లక్ష్యం

**షాద్‌నగర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్, కర్ణాటక ఎమ్మెల్సీ పి.వి. మోహన్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ మాజీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, అబ్జర్వర్ శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భారత్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పీ. రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీలు, వివిధ విభాగాల నాయకులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి పార్టీ బలోపేతం, జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను అబ్జర్వర్లకు వివరించారు. కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎంపిక చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతమే ప్రతి కార్యకర్త ప్రధాన లక్ష ్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే అన్ని ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలనే లక్ష ్యంతో ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని అన్నారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే శిరోధార్యమని, పార్టీ ప్రయోజనాలు, భవిష్యత్ బలోపేతాన్ని దృష్టిలో ఉంచుకుని అధిష్ఠానం నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.